# 'వెడ్డింగ్ బెల్స్'

నుంచి చిన్నతమాషా సన్నివేశం



## మల్లాది వెంకటకృష్ణమూర్తి

**1986 అక్టోబర్ 11.**

అది సికింద్రాబాద్ రాష్ట్రపతి రోడ్ లోని ఓ రెడీమెడ్ బట్టల దుకాణం. దసరా పండగ సందర్భంగా బట్టల కొట్లన్నీ రద్దీగా వున్నాయి. బట్టల దుకాణాల్లో విండో షో కేసుల్లోని బట్టలని చూసుకుంటూ నడుస్తున్న వాళ్ళని ఆ దుకాణాల సేల్స్‌మన్ 'రండి సార్! చూడండి' అని మర్యాదగా అహ్వానిస్తున్నారు.

కొత్తగా పెళ్ళయిన భార్యభర్తలు యథాలాపంగా బట్టల్ని చూసుకుంటూ ఒకరి చేతులు మరొకరు పట్టుకుని నడుస్తున్నారు. వాళ్ళని చూసి ఓ రెడీమేడ్ షాపులోని పధ్నాలుగేళ్ళ కుర్రాడు పిలిచాడు:

"రండిసార్! అమ్మగారికి, మీకూ మంచివున్నాయి."

ఆ కుర్రాడు మిగతా దుకాణాల్లోని సేల్స్‌మెన్ కన్నా రెండాకులు ఎక్కువ చదివినట్లున్నాడు — దుకాణంలోంచి బటయకు వచ్చి, వాళ్ళ వెంట అయిదారు అడుగులు నడిచి మరీ ఆహ్వానించాడు.

"ఇప్పుడేం అవసరంలేదు. అన్నీ కొనేశాం" చెప్పిందా అమ్మాయి.

"ఊరికే వచ్చి చూడండీ!"

అతనికి కోపం వచ్చింది గట్టిగా చెప్పాడు:

"ఊరికే వచ్చి చూస్తాం. కొనం సరేనా?"

"అలాగే సార్! రండి! పంజాబీ డ్రస్ వుంది"

"పంజాబీ డ్రస్ అంటాడేమిటి?" అడిగిందా అమ్మాయి ఆశ్చర్యంతో.

"ఎలాగో టైం స్పెండ్ చేయడానికేగా మనం బయటికి వచ్చింది. బట్టలు చూద్దాం పద" అన్నాడామె భర్త.

ఇద్దరూ ఆ కుర్రాడి వెంట దుకాణంలోకి వెళ్ళారు. ఆ దుకాణం యజమాని పద్దు పుస్తకంలోని పద్దు కూడుకుంటున్నాడు. ఓసారి తలెత్తి కష్టమర్స్ వంక చూసి చెప్పాడు. అతని కంఠంలో ముక్కుపొడుం పీల్చేవ వాళ్ళకుండే జీర.

"చూడ్రా, వాళ్ళకేం కావాలో!"

"పంజాబీ డ్రస్ ఇటుంది సార్!"

ఆ కుర్రాడు కౌంటర్ వెనక్కి వెళ్ళి అలమరా లోంచి నాలుగైదు రకాల పంజాబీ డ్రస్‌లు తీసి కౌంటర్ మీద పరిచి చెప్పాడు.

"ఈ ఎర్రది ఆమెకి బావుంటుంది సార్!"

"ఊరికే చూడ్డానికి వచ్చా ం కాని కొంటానికి కాదుగా!" చెప్పాడు భర్త విసుగ్గా.

"ఆకుపచ్చవీ వున్నాయి సార్!" చెప్పాడా కుర్రాడు. ఉత్సాహంగా మరో అలమరాలోంచి ఆకుపచ్చ రంగు పంజాబీ డ్రస్ తీసి వాళ్లముందుంచాడు చిరునవ్వుతో.

"చెవిటి మాలోకంలా వున్నాడు" విసుక్కున్నాడు భర్త.

ఆ అమ్మాయి ఓ పంజాబీ డ్రస్‌ని తన వంటి మీద వుంచుకుని చూసుకుని తన భర్త వంక చూసి అడిగింది.

"ఎలా వుంది మాష్టారూ! కొనమని అడగనులెండి. కంగారు పడకండి."

"బావుంది."

"ఎంతబ్బా యిది?" అడిగింది ఆ కుర్రాడిని.

"ఏమంటున్నారు?" అడిగాడు కుర్రాడు.



"ఎంత?" భర్త గట్టిగా అడిగాడు విసుగ్గా

"కనుక్కుని చెప్తాను"

అని ఆ కుర్రాడు పద్దు కూడుతున్నతన్ని అడిగాడు:

"సార్! ఇదెంత?"

"ఇటు తీసుకురా!" చెప్పాడతను విసుగ్గా.

ఆమె ఆ జతని, అతనికి అందించింది. దాన్ని పరిశీలించి ఆమెకి తిరిగి ఇచ్చేసి చెప్పాడు కుర్రాడికి:

"తొంభై నాలుగు రూపాయిలు."

"ఎంత సార్?" చెవి పక్కకి చెయ్యిని పోనిచ్చి అడిగాడు కుర్రాడు.

"తొంభై నాలుగ బే! చెవిటి నాయాలాని — చెవిటి నాయాల!" కసిరాడా వ్యక్తి కోపంగా. "బయటికెళ్తున్నాను. ఫోన్ వస్తే చూడూ." లేచి బయటకు వెళ్ళిపోయాడు.

ఆ కుర్రాడు వాళ్ళ వంక చూసి చెప్పాడు సంతోషంగా:

"ఏభై నాలుగు రూపాయిలే సార్! ఫస్ట్ క్లాస్‌గా వుంటుంది అమ్మగారికి. ఫెస్టివెల్‌కి కొనివ్వండి. లేదా నవంబర్ ఒకటివ దీపావళికి కొనివ్వండి!"

భార్యభర్తలిద్దరూ ఒకరి మొహం వంక మరొకరు చూసుకున్నారు. తొంభై నాలుగు ఈ కుర్రాడికి ఏభై నాలుగ్గా వినబడింది. నలభై రూపాయిల లాభం!

"పేక్ చేయమంటారా?" అడిగాడు సేల్స్‌బాయ్.

"చెయ్యి." చెప్పాడు భర్త వెంటనే.

"పాపం. మోసం కదండీ!" భర్తని పక్కకి లాగి నెమ్మదిగా చెప్పింది ఆ అమ్మాయి.

"ఇందులో మోసం ఏముంది? ఈ కుర్రాడు చెప్పిందే ఇస్తున్నాంగా? ఇలాంటివాడిని పెట్టుకోవడం ఓనర్‌ది తప్పు"

గబ గబా ఏభై నాలుగు రూపాయిలు ఇచ్చి, ఆ కుర్రాడిచ్చిన పేకెట్‌తో బయటకి జారుకున్నాడా భర్త. వాళ్ళు గుమ్మం దాటగానే ఎదురయ్యాడు షాపు ఓనర్.

"తీసుకున్నారా?" అడిగాడతను.

"ఆ!"

ఆ ఇద్దరు వడివడిగా నడిచి జనంలో కలిసిపోయారు. ఆయన దుకాణంలోకి వచ్చాడు.

"ఏరా?" అడిగాడు కుర్రాణ్ణి.

"కొన్నార్ సార్!" చెప్పాడా కుర్రాడు సంతోషంగా.

"కొనక చస్తారా? ఇంతదాకా ఎవరు కొనకుండా వెళ్లారు చెప్పు? మనల్ని మోసం చేస్తున్నారనుకుంటారు కొనే ప్రతివాడు. కాని, తెచ్చి పెట్టుకున్న చెవుడుతో వాడిచేత చచ్చినట్టు కొనిపించే నాటకం ఆడుతున్నామని ఏ వెధవ గ్రహించలేదు. తేరగా వస్తే పట్టుకుపోదామనుకునే యావే ఈ రోజుల్లో ప్రతి అడ్డగాడిదకీ!" అన్నాడు. దుకాణం యజమాని.

తర్వాత కేష్ బాక్స్‌లోంచి ముక్కుపొడుం కాయ తీసి, చిటికెడు ముక్కుపొడుం పీల్చి చెప్పాడు:

"ఆ వెళ్లే వాళ్లు కూడా వెధవల్లానే వున్నారు. వాళ్ళబ్బాయి మాత్రం ముందొస్తున్నాడు కాని, ఓ మాంచి బాబా సూటు కొనిపించు." ●

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్‌-సికిందరాబాద్ వారు ప్రచురించిన మల్లాది వెంకట కృష్ణమూర్తి నవల 'వెడ్డింగ్ బెల్స్'లో ఒక చిరు కథ ఇది.